సాక్షి
మహబూబాబాద్
శుక్రవారం । 16 । జూన్ । 2023



అన్నదాతలు.. అప్రమత్తం

అన్నదాతలు కోటి ఆశలతో వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో నకిలీ విత్తనాల బెడద వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. - 8లో▸



రాష్ట్రంలో ప్రగతి పరుగులు

బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రగతి పరుగులు తీస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
43.8^0 / 31.1^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచే వేడి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్‌

పల్లె ప్రగతితో మంచి ఫలితాలు



దోర్నకల్‌: పల్లె, పట్టణ ప్రగతితో పల్లెలు, పట్టణాల్లో మంచి ఫలితాలు వచ్చాయని అడిషనల్‌ కలెక్టర్‌ అభిలాష అభినవ్‌ అన్నారు. మండలంలోని తహసీల్దారు బంజర గ్రామంలో గురువారం జరిగిన పల్లెప్రగతి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పల్లె, పట్టణ ప్రగతి అమలులో పంచాయతీ, మున్సిపాలిటీ, పారిశుద్ధ్య సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టేదారు భూములు రిజిస్ట్రేషన్‌ అయినా పట్టాలు రాలేదని స్థానికులు తెలుపగా సమస్యను పరిశీలిస్తామని ఆమె తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ అంకతి సీతారామయ్య, ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ మున్వర్‌బేగ్‌ తదితరులు పాల్గొన్నారు

రేపు జాబ్‌మేళా

మహబూబాబాద్‌: కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో ఈనెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ ఆటోమోటివ్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ మహబూబాబాద్‌లో మార్కెటింగ్‌ ఎగ్జిక్యూటివ్స్‌, మార్కెటింగ్‌ మేనేజర్లు, టెలికాలర్స్‌, టెక్నిషియన్లు, డ్రైవర్లుగా పని చేయడానికి ఆసక్తి గల వారు జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. పదో తరగతి, ఇంటర్‌, డిగ్రీ, ఐటీఐ ఇతర విద్యార్హతలు ఉన్న 20 సంవత్సరాలు పైబడిన వారు అర్హులన్నారు. జాబ్‌మేళాకు బయోడేటా, స్టడీ సర్టిఫికెట్స్‌, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌ ప్రతులను తీసుకొని రావాలన్నారు. పూర్తి వివరాల కోసం 9676375527 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రజల వద్దకే పరిపాలన



బయ్యారం: తెలంగాణలో కొత్త జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీల ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన అందుబాటులోకి వచ్చిందని జెడ్పీ చైర్‌పర్సన్‌ బిందు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గురిమెళ్లలో నిర్వహించిన పల్లెప్రగతి గ్రామ సభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌ అనసూర్య, ఎంపీటీసీ భద్రయ్య, ఎంపీడీఓ చలపతిరావు, ఎంపీఓ వెంకటరమణ, మిషన్‌ భగీరథ జేఈ శ్రీజ పాల్గొన్నారు.

ముగ్గురు కార్యదర్శుల సస్పెన్షన్‌

దంతాలపల్లి: మండలంలోని గున్నెపల్లి, వాల్యతండా, లక్ష్మిపురం జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు అక్షర, శ్రీకాంత్‌, వెంకన్నను సస్పెండ్‌ చేసినట్లు మండల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి గురువారం తెలిపారు. గున్నెపల్లి రెగ్యులర్‌ జేపీఎస్‌ అక్షర ప్రసూతి సెలవులో ఉన్నప్పుడు వాల్యతండా, లక్ష్మిపురం కార్యదర్శులు శ్రీకాంత్‌, వెంకన్నలకు ఇన్‌చార్జ్‌ బాధ్యతలు అప్పగించామన్నారు. ఆ సమయంలో వారు గున్నెపల్లిలో చనిపోయిన వారి పేర్లపై వస్తున్న ఆసరా పింఛన్‌ నిధులను కొంతకాలం డ్రా చేసి అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు పంపామన్నారు. ఆరోపణలు నిజమని తేలడంతో కలెక్టర్‌ ఆదేశాల మేరకు వారిని సస్పెండ్‌ చేసినట్లు తెలిపారు. అలాగే రెగ్యులర్‌ పంచాయతీ కార్యదర్శి అక్షర కూడా ప్రసూతి సెలవులకు వెళ్లే ముందు పింఛన్ల డబ్బులు పక్కదారి పట్టించిందని, ఆమెను కూడా సస్పెండ్‌ చేసినట్లు పేర్కొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయండి

కలెక్టర్‌ శశాంక

మహబూబాబాద్‌: జిల్లా ఓటరు జాబితా ముసాయిదాను ఆగస్టు రెండో తేదీన ముద్రించి అందిస్తామని, అభ్యంతరాలు ఉంటే జూలై 31లోపు తెలియజేయాలని కలెక్టర్‌ శశాంక రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లో ఓటరు జాబితా ముసాయిదా ముద్రణపై అఖిలపక్ష పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్‌ డేవిడ్‌, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి కలెక్టర్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. అర్హులైన వారితో ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలని, సవరిస్తామని అన్నారు. సమావేశంలో అధికారులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పట్టణం.. అభివృద్ధి

మానుకోటలో కోట్ల రూపాయలతో పనులు

- సుందరీకరణపై ప్రత్యేక దృష్టి
- 43కు చేరిన పారిశుద్ధ్య వాహనాలు
- సకల సౌకర్యాలతో వెజ్‌ అండ్‌ నాన్‌వెజ్‌ మార్కెట్‌
- ఐదు సెంట్రల్‌ జంక్షన్లు, 9 ఓపెన్‌ జిమ్‌లు, 5 పార్కుల ఏర్పాటు
- నేడు పట్టణ ప్రగతి దినోత్సవం

మహబూబాబాద్‌: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత మానుకోట పట్టణ రూపురేఖలు మారాయి. జిల్లా కేంద్రం కావడంతో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. రోడ్లు, జంక్షన్ల విస్తరణ, ఓపెన్‌ జిమ్‌లు, పార్కులు, వెజ్‌ అండ్‌ నాన్‌వెజ్‌ మార్కెట్‌ నిర్మాణం, నూతన కలెక్టరేట్‌, మెడికల్‌ కళాశాల వంటి నిర్మాణాలతో మానుకోట స్వరూపం మారింది. వీటితో పాటు మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కాగా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు మానుకోట మున్సిపాలిటీలో తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులపై నివేదిక తయారు చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

నేటి కార్యక్రమాలు..

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చేపట్టే పట్టణ ప్రగతి దినోత్సవం కోసం మానుకోట మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఈనెల 13వ తేదీన స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కాగా నేడు తహసీల్దార్‌ కార్యాలయం నుంచి మదర్‌థెరిస్సా సెంటర్‌ వరకు మున్సిపాలిటీ వాహనాలతో సిబ్బంది, అధికారులు, మెప్మా బృందం తదితరులు భారీ ర్యాలీ తీసి మానవహారం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం నందన గార్డెన్‌లో సమావేశం నిర్వహించి తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించనున్నారు. అందుకు నివేదికను తయారు చేశారు.



మానుకోట పట్టణ వ్యూ

పట్టణప్రగతి కింద రూ.21.26కోట్లు..

పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మానుకోట మున్సిపాలిటీకి రూ.21.26 కోట్లు మంజూరయ్యాయి. 2014 నుంచి వచ్చిన నిధులతో హరితహారం కార్యక్రమం చేపట్టారు. పట్టణంలో 7నర్సరీలు, 60 పట్టణ ప్రకృతి వనాలు, ఐదు పార్కులు, 17.5కిలోమీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్‌ చేపట్టి సందరవనంగా తీర్చిదిద్దారు.

వెజ్‌ అండ్‌ నాన్‌వెజ్‌ మార్కెట్‌..

మున్సిపాలిటీ పరిధిలో రెండు వైకుంఠధామాలు, ఒక వైకుంఠ రథం ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలో సకల సౌకర్యాలతో రూ.5కోట్ల వ్యయంతో వెజ్‌ అండ్‌ నాన్‌వెజ్‌ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మిషన్‌ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నారు. అలాగే పట్టణంలో 9 ఓపెన్‌ జిమ్‌లు, 18 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. ప్రజలకు మెరుగైన వైద్యం కోసం సిగ్నల్‌ కాలనీలో బస్తీ దవాఖాన నిర్మించారు. పట్టణంలో రాత్రి పూట వెలుగులు విరజిమ్మేలా ఎల్‌ఈడీ లైటింగ్‌ ఏర్పాటు చేశారు.

పారిశుద్ధ్యంపై దృష్టి..

పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ మేరకు వాహనాలను 10నుంచి 43కు పెంచారు. దీంతో పారిశుద్ధ్యం మెరుగుపడింది. మున్సిపాలిటీలోని రెండు ప్రాంతాల్లో కంపోస్ట్‌ షెడ్లు ఏర్పాటు చేశారు. పొడి చెత్తను వేరుచేసి ఆదాయం కోసం రెండు డీఆర్‌సీసీ సెంటర్లు ఏర్పాటు చేశారు. 8 ప్రజామరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. పలు నిర్మాణాలతో ఓడీఎఫ్‌ ప్లస్‌ స్థాయిని సాధించింది. మల వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ ఏర్పాటు చేశారు. డంపింగ్‌ యార్డులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

సుందరీకరణ పనులు..

మానుకోట పట్టణంలోని ఐదు జంక్షన్లను అభివృద్ధి చేశారు. 1.5కిలోమీటర్ల మేర వాల్‌ పెయింటింగ్‌, 397.64 కిలోమీటర్ల మేర రోడ్లు, 293.10కిలోమీటర్లు డ్రెయినేజీలు, 4.22 కిలోమీటర్ల మేర సెంట్రల్‌ డివైడర్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల సీఎం కేసీఆర్‌ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు కేటాయించారు. వాటితో మరింత అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..

తెలంగాణ వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిపై నివేదిక తయారు చేశాం. కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగి మానుకోట రూపురేఖలు మారాయి. శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా ర్యాలీతో పాటు పలు కార్యక్రమాలు, నందన గార్డెన్‌లో సమావేశం నిర్వహిస్తాం. దీనికి అన్ని ఏర్పాట్లు చేశాం.

రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌, మానుకోట

అన్ని వర్గాలకు అండగా సీఎం



మాట్లాడుతున్న ఎంపీ మాలోత్‌ కవిత, వేదికపై ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ తదితరులు

మరిపెడ: సీఎం కేసీఆర్‌ అన్ని వర్గాలకు అండగా ఉంటున్నారని ఎంపీ మాలోత్‌ కవిత అన్నారు. గురువారం మండలంలోని చిల్లంచర్ల,రాంపురం, తదితర గిరిజన తండాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తో కలిసి ఎంపీ కవిత శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. డోర్నకల్‌ నియోజకవర్గంలో రెడ్యానాయక్‌ అంటే ప్రాణాలు ఇచ్చేవారు ఉన్నారని, అలాంటి వ్యక్తిని కాపాడుకోవాలన్నారు. కాగా రాంపురం గ్రామంలో ఎంపీ కవిత బోనం ఎత్తుకుని సందడి చేశారు.

అదే లొల్లి..

పింఛన్లు, డబుల్‌బెడ్రూం ఇళ్లు, రైతు రుణమాఫీ చేయాలని ఎంపీ కవిత, ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ ఎదుట ప్రజలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మీకు ఓటు వేస్తున్నాం.. మాకు ఎందుకు న్యాయం చేయడం లేదని ప్రశ్నించారు. పేదలను గుర్తించి డబుల్‌ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఎంపీ కవిత స్పందించి మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ నవీన్‌, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారదరవీందర్‌, మాజీ ఎంపీపీ వెంకన్న, మహేందర్‌రెడ్డి, కృష్ణ ఉన్నారు.

కూల్‌.. ఆటో

మహబూబాబాద్‌ మండలం దర్గా తండాకు చెందిన భూక్యా అంజి తన ఆటో ఎక్కే ప్రయాణికులకు ఎండవేడిమి తగలకుండా ఆటోపై పచ్చని వరినారు ఏర్పాటు చేశాడు. తట్టు బస్తాల్లో మొలక కట్టి టాప్‌, చుట్టుపక్కల అమర్చాడు. మండుటెండలో ప్రయాణికులకు 40 రోజులుగా ఇలా చల్లదనాన్ని అందిస్తున్నట్లు అంజి తెలిపాడు.

– సాక్షి, స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, మహబూబాబాద్‌



ఆటోలో చల్లని ప్రయాణం

ఉక్కు పరిశ్రమ సాధనకు పాదయాత్ర

బయ్యారం: బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో త్వరలోనే పాదయాత్ర నిర్వహిస్తామని ఆపార్టీ అనుబంధ ఎస్టీ విభాగం జాతీయ ఉపాధ్యక్షుడు తేజావత్‌ బెల్లయ్యనాయక్‌ అన్నారు. బయ్యారం నుంచి మహబూబాబాద్‌ వరకు పాదయాత్ర చేపడుతానని చెప్పారు. గురువారం బయ్యారం సమీపంలోని ఇనుపరాయిగుట్టను కాంగ్రెస్‌ నాయకులతో కలిసి బెల్లయ్యనాయక్‌ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తే జిల్లాలోని వేలాదిమంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, లక్షలాదిమందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్‌ పార్టీ బయ్యారం ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని చట్టంలో చేర్పిందన్నారు. పరిశ్రమ ఏర్పాటుపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జిల్లా మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌ ఉక్కుపరిశ్రమ ఏర్పాటుపై బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఇల్లెందు నియోజకవర్గంలోని బయ్యారం, గార్ల మండలాలకు ఏవిధంగా మేలు జరిగిందో ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించాలన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు బాధ్యతను కాంగ్రెస్‌ పార్టీ తీసుకుంటుందని, ప్రజలు తమకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, సీతారాంరెడ్డి, రామునాయక్‌, భాస్కర్‌, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బయ్యారం గుట్టపై ఇనుపరాయిని పరిశీలిస్తున్న బెల్లయ్యనాయక్‌ తదితరులు

ఆశ్రమ పాఠశాల తనిఖీ

కొత్తగూడ: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీఓ అంకిత్‌ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థుల వివరాలు తెలుసుకొని, మిగతా వారు ఎందుకు రాలేదని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పిల్లలను పాఠశాలకు రప్పించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. సోమవారంలోగా పూర్తిస్థాయిలో పిల్లలు రావాలని, లేదంటే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలో వసతుల గురించి పీఓ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజమ్మ, హెచ్‌డబ్ల్యూఓ భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉత్సవాలకు రావాలి

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే గిరిజన వేడుకలకు రావాలని మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఐటీడీఏ పీఓ అంకిత్‌ గురువారం మొండ్రాయిగూడెం గ్రామంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఏటూరునాగారంలో గిరిజన ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రికి వివరించారు. తప్పకుండా హాజరవుతానని మంత్రి హామీ ఇచ్చారు.



పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఓ అంకిత్‌

రక్తదానం చేసి ప్రాణ దాతలుగా మారాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌

తొర్రూరు: రక్తదానం చేసి ప్రాణ దాతలుగా మారాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల సహాయార్థం గురువారం డివిజన్‌ కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన పలువురికి ఎస్పీ ప్రశంస పత్రాలు అందించారు. రక్తదానం మహాదానమని, వివిధ ప్రమాదాల్లో రక్తం అవసరమైన వారికి సేకరించిన రక్తం ఉపయోగపడుతుందన్నారు. దానం చేయాలంటే డబ్బు కావాలని, కానీ రక్తదానం చేయాలంటే మంచి మనసు ఉంటే చాలన్నారు. పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో ఏటా అన్ని పోలీస్‌ స్టేషన్లలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘు, ఎస్సైలు గండ్రాతి సతీష్‌, పిల్లల రాజు, లింగారెడ్డి, జగదీశ్‌, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

నీట్‌లో గిరిజన కళాశాల విద్యార్థుల ప్రతిభ

హన్మకొండ చౌరస్తా: నీట్‌ పరీక్షలో హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలోని తెలంగాణ గిరిజన ప్రతిభా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ నందమూరి పద్మిని హర్షం వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థులు మూడావత్‌ కావ్యాంజలి 467వ, మాలావత్‌ స్వాతిప్రియ 394వ, కొర్ర రేఖ 371వ, తేజావత్‌ నవ్యతేజ 367, నేనావత్‌ శారద 363వ ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్‌ సీట్లు పొందడానికి అర్హత సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలిపింది.

సాగు నీరందించేందుకు కృషి

- పల్లె ప్రగతి దినోత్సవంలో మంత్రి సత్యవతిరాథోడ్‌

కొత్తగూడ: ఏజెన్సీలోని కొత్తకూడ మండలానికి పాకాల రిజర్వాయర్‌ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరందించేందుకు కృషి చేస్తానని మంత్రి సత్యవతిరాథోడ్‌ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పల్లెప్రగతి దినోత్సవాన్ని మండలంలోని మొండ్రాయిగూడెంలో నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించడమే కేసీఆర్‌ లక్ష్యమన్నారు. పోడు హక్కు పత్రాలను ఈనెల 24నుంచి పంపిణీ చేయడంతో పాటు రైతుబంధు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగూడ, గంగారం మండలాల్లోని గ్రామాల రోడ్ల మరమ్మతులకు సుమారు రూ.18 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మొండ్రాయిగూడెం గ్రామానికి తన సీడీఎఫ్‌ నుంచి రూ.10లక్షల నిధులను వెంటనే మంజూరు చేస్తానన్నారు. ముందుగా గుంజేడు ముసలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన మంత్రి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కలెక్టర్‌ శశాంక మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం అందిస్తానన్నారు. వైద్యం కోసం ఒకప్పుడు నర్సంపేటకు వెళ్లాల్సి వచ్చేదని ఇప్పుడు గ్రామ దావాఖానలో మెరుగైన వైద్యం అందుతుందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్‌

రద్దయిన పట్టాలను పునరుద్ధరించుకోగలిగాం..

ఫారెస్టు ఏరియాలో విస్తరించి ఉన్నందున గతంలో రద్దయిన భూముల హక్కు పత్రాలను ఇటీవల మళ్లీ పొందామని మొండ్రాయిగూడెం వాసి బంగారి నరేష్‌ సభావేదిక వద్ద తెలిపి ఆనందం వ్యక్తం చేశాడు. సర్వేలో రెవెన్యూ భూములుగా తేలయడంతో కలెక్టర్‌ చొరవతో 300 ఎకరాల పట్టాలను పునరుద్ధరించుకున్నట్లు మంత్రికి వివరించాడు. ఐటీడీఏ పీఓ అంకిత్‌, ట్రెయినీ కలెక్టర్‌ పింకేష్‌కుమార్‌, డీపీఓ నర్మద, పీఆర్‌ ఈఈ సురేష్‌, సర్పంచ్‌ భారతి, ఎంపీపీ బానోత్‌ విజయరూప్‌సింగ్‌, జెడ్పీటీసీ పుష్పలత, ఓడీసీఎంఎస్‌ వైస్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు సదయ్య, సంతోషారాణి, తహసీల్దార్‌ చనరేష్‌, ఎంపీడీఓ భారతి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు పెరిగాయి



మహబూబాబాద్‌: తెలంగాణలో జీవనప్రమాణాలు పెరిగాయని మంత్రి సత్యవతి రాథోడ్‌ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒకప్పుడు తండాల్లో తాగునీరు, విద్యుత్‌ సమస్యలు ఉండేవని, రాష్ట్ర ఏర్పాటుతో ఆ సమస్యలు తీరాయన్నారు. పల్లె ప్రగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవార్డులు అందజేశారు. ఎమ్మెల్యే బానోత్‌ శంకర్‌నాయక్‌, కలెక్టర్‌ శశాంక, అదనపు కలెక్టర్‌ అభిలాష అభినవ్‌, ట్రైనీ కలెక్టర్‌ పింకేష్‌కుమార్‌, జెడ్పీ సీఈఓ రమాదేవి పాల్గొన్నారు.

పరిజ్ఞానం పెంచాలి

మహబూబాబాద్‌ అర్బన్‌: విద్యార్థులకు సైన్స్‌, గణితం సబ్జెక్టుల్లో పరిజ్ఞానం పెంచాలని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం జీ–20 జాతీయ విద్యావిధానాన్ని డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేవీల్లో చదువుతున్న విద్యార్థులకు జీ–20 కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీ ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపాల్‌ శోభన్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మున్సిపాలిటీగా మానుకోట

మహబూబాబాద్‌: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహబూబాబాద్‌ను ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపిక చేసినట్లు మున్సిపల్‌ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జంక్షన్ల అభివృద్ధి, మీడియన్‌ డెవలప్‌మెంట్‌ కేటగిరిలో అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. కాగా శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పా కళావేదికలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ చేతుల మీదుగా మున్సిపల్‌ చైర్మన్‌ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్‌ ప్రసన్నరాణి అవార్డు అందుకోనున్నారు. మానుకోట పట్టణ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన మంత్రి సత్యవతిరాథోడ్‌, ఎమ్మెల్యే బానోత్‌ శంకర్‌నాయక్‌, ఎంపీ మాలోత్‌ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కలెక్టర్‌ శశాంక, అదనపు కలెక్టర్‌ అభిలాష అభినవ్‌, మున్సిపల్‌ చైర్మన్‌ రామ్మోహన్‌రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి కమిషనర్‌ ప్రసన్నరాణి కృతజ్ఞతలు తెలిపారు. సమష్టి కృషితోనే అవార్డు వరించిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపల్‌ చైర్మన్‌ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఆడబిడ్డగా సేవ చేసేందుకే వచ్చా..

- ఎన్‌ఆర్‌ఐ, కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర నాయకురాలు ఝాన్సీరెడ్డి

తొర్రూరు రూరల్‌: అమెరికాలో స్థిరపడి, అన్ని వనరులు ఉన్నా.. వదులుకొని మీ ఆడబిడ్డగా సేవ చేసేందుకే వచ్చానని ఎన్‌ఆర్‌ఐ, కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన పార్టీ పాలకుర్తి నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. ఎన్నో ఏళ్ల క్రితం అమెరికాకు వెళ్లి స్థిరపడి, పుట్టిన గడ్డకు సేవ చేయాలనే లక్ష్యంతో ఇక్కడ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. త్వరలో అధికారికంగా కాంగ్రెస్‌ పార్టీలో చేరిన తర్వాత ప్రతి గ్రామానికి వచ్చి, ప్రతి ఇంటి తలుపు తడతానన్నారు. అంతకు ముందుకు తొర్రూరు పట్టణానికి చేరుకున్న ఎన్‌ఆర్‌ఐ ఝాన్సీరెడ్డికి కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బ్లాక్‌, మండల, గ్రామస్థాయి నాయకులు,కార్యకర్తలు, యువత ఎన్‌ఆర్‌ఐ ఝాన్సీరెడ్డిని గజమాలతో సత్కరించారు. నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సత్యనారాయణ, హమ్యానాయక్‌, కుమార్‌, సురేష్‌, కృష్ణమూర్తిగౌడ్‌, సురేష్‌నాయక్‌, ప్రభాకర్‌, సధాకర్‌, రాంరెడ్డి, అచ్చిరెడ్డి, రాజశేఖర్‌, కుమార్‌ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

తూకంలో తేడా వస్తే చర్యలు

తొర్రూరు: తూకంలో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి విజయ్‌కుమార్‌ అన్నారు. తూనికలు, కొలతల్లో మోసాలపై డివిజన్‌ కేంద్రంలోని మోడల్‌ మార్కెట్‌లో గురువారం లీగల్‌ మెట్రాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీఐసీ జిల్లా ఇన్‌చార్జ్‌ వింజమూరి సుధాకర్‌తో కలిసి విజయ్‌కుమార్‌ మాట్లాడారు. తూకంపై అనుమానం వస్తే వినియోగదారులు సమాచారం అందించాలన్నారు. వినియోగదారులను మోసగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న అధికారి విజయ్‌కుమార్‌

ఆన్‌లైన్‌ మోసం..

- రూ.2.50 లక్షలు నష్టపోయిన బాధితుడు
- మరో పది మంది కూడా..
- రూ. 6 లక్షల వరకు నష్టపోయినట్లు సమాచారం




మహబూబాబాద్‌ రూరల్‌ : సైబర్‌ నేరాల నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు రూపొందించినా కేటుగాళ్లు మారడం లేదు. వివిధ మార్గాల్లో మోసాలను కొనసాగిస్తూనే ఉన్నారు. బ్యాంకు ఖాతా అప్‌డేట్‌ చేసుకోమనో.. ఏటీఎం పిన్‌ నంబర్‌ మార్చాలి.. ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెప్పమనో అమాయకులను వివిధ రూపాల్లో దోచుకుంటూనే ఉన్నారు. ఫలితంగా రోజూ ఏదో చోట పలువురు సైబర్‌ మోసాల బారిన పడుతున్నారు. తాజాగా మహబూబాబాద్‌ మండలంలోని కొమ్ముగూడెం తండా గ్రామానికి చెందిన లావుడ్య మనోహర్‌ ఆన్‌లైన్‌ మోసంలో చిక్కుకుని రూ.2.50 లక్షలు నష్టపోయాడు. మనోహర్‌ ఆన్‌లైన్‌లో చైనా యాప్‌ ద్వారా వివిధ వస్తువులు కొనుగోళ్లు చేయడంతోపాటు పెట్టుబడి కూడా పెట్టాడు. అవతలి వ్యక్తులు పలుమార్లు ఇతడికి మేలు చేసి చూపించారు. కొంత పెట్టుబడి పెట్టగా కమీషన్‌ రూపంలో మరికొంత మొత్తాన్ని ఆన్‌లైన్‌ ఖాతాదారుడికి చెల్లించారు. దీంతో మనోహర్‌ కమీషన్‌ మరింత వస్తుందని నమ్మి అధిక మొత్తంలో లావాదేవీలు జరుపగా రూ. 2.50 లక్షల వరకు నష్టపోయాడు. దీనిపై సైబర్‌క్రైం వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అదే విధంగా కొమ్ముగూడెంకు చెందిన మరో పది మంది కూడా చైనా యాప్‌లో పెట్టుబడి పెట్టి కనీసం వస్తువు కూడా పొందకుండానే రూ. 6 లక్షల వరకు నష్టపోయి మోసపోయినట్లు తెలిసింది.

అన్నదాతలు..అప్రమత్తం

- నకిలీ విత్తనాలను గుర్తించకపోతే నష్టం
- దిగుబడిలో విత్తన నాణ్యత కీలకం
- డూప్లికేట్‌ సీడ్స్‌ను ఇలా గుర్తించాలి : శాస్త్రవేత్తలు





కరీమాబాద్‌ : అన్నదాతలు కోటి ఆశలతో ఖరీఫ్‌ సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో నకిలీ విత్తనాల బెడద వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పత్తి, మిరప, వరి, మొక్కజొన్న విత్తనాలలో ఏది నాణ్యమైందో.. ఏది నకిలీదో తెలియని స్థితిలో గందరగోళానికి గురవుతున్నారు. ఎక్కువ దిగుబడి వస్తుందంటూ దళారులు మాయమాటలతో ఊరు పేరు లేని విత్తనాలను అంటగడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. విత్తన ఎంపిక, నకిలీని గుర్తించడంలో అవగాహన ఉండాలని పేర్కొంటున్నారు.

నకిలీ విత్తనం అంటే..

విత్తన ధ్రువీకరణ సంస్థ నుంచి అనుమతి లేని గింజలను నకిలీ విత్తనాలుగా పరిగణిస్తారు. అంతేకాకుండా ఎలాంటి అడ్రస్‌ లేకుండా అక్రమంగా అమ్ముతున్న విత్తనాలను కూడా నకిలీగానే భావించాలి. వాణిజ్య పరీక్షల నుంచి చోరీకి గురైన విత్తనాలు, నకిలీ ప్యాకింగ్‌ చేసి అమ్ముతున్న విత్తనాలు, లైసెన్స్‌ లేకుండా అమ్ముతున్న డీలర్ల వద్ద లభించే విత్తనాలను కూడా నకిలీగానే గుర్తించాలి.

నకిలీ విత్తనాలను గుర్తించడం రెండు రకాలు..

నకిలీ విత్తనాలను రెండు రకాలుగా గుర్తించొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందులో ఒకటి పంట వేయక ముందు, రెండోది పంట వేసిన తర్వాత. అయితే పంట వేయక ముందే నకిలీదని గుర్తిస్తే రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండొచ్చు. పంట వేసిన తర్వాత గుర్తించినా లాభం ఉండదు. అందుకే రైతులు విత్తనాలు ధ్రువీకరించుకున్న తర్వాతనే నాటుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

1. విత్తనం నాటక ముందు..

- ప్రభుత్వ లైసెన్స్‌ పొందిన డీలర్ల దగ్గరే విత్తనాలు కొనాలి.
- విత్తన ప్యాకెట్లపై కంపెనీ హోలోగ్రాం సరి చూసుకోవాలి.
- తక్కువ ధరకు వస్తున్నాయని మూట కట్టిన విత్తనాలను కొనొద్దు.
- రైతులు రశీదు(బిల్లు)లు తప్పకుండా తీసుకోవాలి.
- విత్తన బ్యాగు వెనక పచ్చరంగులో ఉంచిన స్టిక్కర్‌ లేదా ట్యాగ్‌ ఉందో లేదో చూసుకోవాలి. ట్రూత్‌ఫుల్లీ విత్తనం అయితే 'పచ్చ రంగు' ధ్రువీకరణ పొందిన విత్తనమైతే 'నీలి రంగు' ట్యాగ్‌లుంటాయి.
- విత్తన ట్యాగ్‌లపై కంపెనీ లైసెన్స్‌ నంబర్‌, లాట్‌ నంబర్‌, క్యూఆర్‌ కోడ్‌తోపాటు వ్యాలిడిటీ డేట్‌ కూడా చూసుకోవాలి.

2. పంట కాలంలో అయితే..

- విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడం
- మొలకెత్తిన మొక్కలు ఎత్తుగా పెరగకపోవడం
- పూర్తిస్థాయిలో పూత రాకపోవడం
- వచ్చిన పూత రాలిపోవడం, కాయలుగా మారకపోవడం వంటి లక్షణాలు పంట సమయంలో గుర్తించొచ్చు.

దిగుబడిలో విత్తన ఎంపికే కీలకం..



పంటల దిగుబడి విషయంలో విత్తనాల ఎంపిక కీలకం. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో లైసెన్స్‌, క్యూఆర్‌ కోడ్‌, ప్యాకింగ్‌ డేట్‌, వ్యాలిడిటీ డేట్‌ చూసుకోవాలి. తక్కువ ధరకు వస్తున్నాయని విడి విత్తనాలు కొనొద్దు. రంగుల కవర్లలో ప్యాక్‌ చేసి అమ్ముతున్న విత్తనాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

డాక్టర్‌ రాజు, సమగ్ర సస్యరక్షణ శాస్త్రవేత్త

బ్రిడ్జి రక్షణ గోడను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



మహమ్మద్‌ ఇక్బాల్‌ అహ్మద్‌ మృతదేహం

రఘునాథపల్లి : కారు అతివేగం ఒకరి ప్రాణాన్ని బలిగొనగా, మరో ముగ్గురిని గాయాలకు గురిచేసింది. ఈ ఘటన హన్మకొండ, హైదరాబాద్‌ జాతీయ రహదారిపై నిడిగొండ బ్రిడ్జి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కేశిరెడ్డి యోగేశ్వర్‌రెడ్డి తన కారులో హైదరాబాద్‌లో నలుగురు ప్రయాణికులకు ఎక్కించుకొని హన్మకొండకు బయలుదేరాడు. ఈక్రమంలో నిడిగొండ బ్రిడ్జి వద్ద అతివేగంగా వచ్చి అదుపు తప్పి రక్షణ గోడకు ఢీకొన్నాడు. దీంతో డ్రైవర్‌ సీటు వెనక కూర్చున్న హన్మకొండకు చెందిన మహమ్మద్‌ ఇక్బాల్‌ అహ్మద్‌ (43) అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ముగ్గురు తాటికొండ నవీన్‌, కురిమిల్ల అనూష, ఝెరొ అవినాశ్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్‌ యోగేశ్వర్‌రెడ్డి ప్రమాదం నుంచి బయటపడి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను 108లో జనగామ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతివేగం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి మహమ్మద్‌ ఖాజా అహ్మద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

పరువు తీస్తున్నారని.. వ్యక్తి ఆత్మహత్య



రాములు(ఫైల్‌)

జనగామ: కుటుంబ సభ్యులే తన పరువు తీస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నాగపురంలో జరిగింది. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం జనగామ గ్రామానికి చెందిన ఆవునూరి రాములు(52) కుల వృత్తి కుమ్మరి పనితోపాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన రాములు.. నిత్యం తన భార్య, కుమారులతో గొడవ పడుతున్నాడు. కుమారులకు పెండ్లిళ్లు అయినప్పటికీ ఉమ్మడిగానే ఉంటున్నారు. తరచూ కోడళ్ల ఎదుట తన పరువు తీస్తున్నారని మనస్తాపానికి గురైన రాములు గురువారం నాగపురం వద్ద ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటువైపు వెళ్తున్న ఒంటిమామిడిపల్లికి చెందిన వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వర్ధన్నపేటకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు నరేశ్‌, సురేశ్‌ ఉన్నారు. భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏడునూతులలో వివాహిత ..



శోభారాణి(ఫైల్‌)

కొడకండ్ల : ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఏడునూతులలో జరిగింది. గ్రామానికి చెందిన బోల్లోజు శోభారాణి(32), వెంకటాచారి దంపతులు. వీరు బుధవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కొమ్మాల గ్రామంలో జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలకు హాజరై వచ్చారు. ఈ క్రమంలో గురువారం ఉదయం దంపతుల మధ్య గొడవ జరిగి భర్త బయటకు వెళ్లగా శోభారాణి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. శోభారాణి మృతికి గల కారణాలు తెలియలేదు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వెంకటాచారి కులవృత్తి, (వడ్రంగి) శోభారాణి టైలర్‌ పని చేసుకొంటూ కొడుకు, కుమార్తెతో కలసి జీవనం కొనసాగిస్తున్నారు.

కొడిశలకుంటలో మహిళ..

ములుగు రూరల్‌: కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం చెందారు. ఈ ఘటన మండలంలోని కొడిశలకుంటలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొడిశల కుంటకు చెందిన పోరిక సంతోష్‌, కవిత (28) దంపతులు. వీరికి కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేశారు. అయినప్పటికీ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో కవిత గురువారం ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆత్మహత్య కేసులో ఐదుగురి అరెస్టు

కేసముద్రం: మండలంలోని ధర్మారం తండా జీపీ శివారు వెంక్యాతండాకు చెందిన బానోతు అశోక్‌.. తన భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మే 30న మృతి చెందాడు. ఈ ఘటనలో అత్తింటికి చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌ మండలం ముత్యాలమ్మతండాకు చెందిన మృతుడి మామ వాంకుడోతు ఆనంద్‌, అత్త సత్రి, భార్య బేబి, మరిపెడ మండలం కొత్తతండాకు చెందిన తోటిఅల్లుడు భుక్యా నరేశ్‌, వదిన రజితను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి



భాగ్యమ్మ(ఫైల్‌)

డోర్నకల్‌ : వడదెబ్బకు గురైన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని ఉయ్యాలవాడకు చెందిన పగిడిపాల భాగ్యమ్మ(65) ఇటీవల ఎండకు అస్వస్థతకు గురై చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందింది.

కూతురికి మానసిక వ్యాధి..

- తమను రక్షించాలని తల్లి పోలీసులకు ఫిర్యాదు
- వైద్య పరీక్షల నిమిత్తం ఎంజీఎంకు తరలింపు

హసన్‌పర్తి: కూతురు మానసిక ప్రవర్తనతో ఇబ్బందులు పడుతున్నామని, ఆమె నుంచి తమను రక్షించాలని కోరుతూ తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన క్రిష్టాది లక్ష్మికి ఇద్దరు కూతురులు ఉన్నారు. ఇందులో పెద్ద కూతురు రాజేశ్వరి(42) 28 ఏళ్లగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. రోజురోజుకూ ఆమె ప్రవర్తనలో మార్పు వస్తోంది. ఈ కారణంగా కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కల వారు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో తల్లిపై కూడా భౌతిక దాడులకు పాల్పడుతోంది.అలాగే, రాత్రి వేళల్లో గది తలుపులు వేసుకుని భయంకరంగా అరుస్తూ ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనిపై స్పందించి తమ కూతురు నుంచి కాపాడాలని తల్లి కోరగా ఆమె ఫిర్యాదు మేరకు రాజేశ్వరిని వైద్య పరీక్షల నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్‌ తెలిపారు.

పాద రక్షలు లేకుండా..దీక్ష



పాద రక్షలు లేకుండా నడుస్తున్న గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌

కొత్తగూడ: : కేసీఆర్‌ మూడోసారి సీఎం కావాలని ఆకాంక్షిస్తూ మంత్రి సత్యవతిరాథోడ్‌ ఆరునెలలుగా కాళ్లకు చెప్పులు వేసుకోకుండా కఠోర దీక్ష చేపడుతున్నారు. ఇందులో భాగంగా మహబూబాబాద్‌ జిల్లా కొత్తగూడ మండలం మొండ్రాయిగూడెం గ్రామంలో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో మండుటెండలో గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖామాత్యులు సత్యవతి రాథోడ్‌ నడిచారు. ఇప్పటికే ఆమె కాళ్లకు బొబ్బలు వచ్చాయి. అయినా దీక్షను విరమించకుండా పాద రక్షలు లేకుండానే నడుస్తున్నారు.

శభాష్‌.. వెంకటయ్య



సీపీఆర్‌ చేసిన అనంతరం శివరామయ్యతో హోంగార్డు వెంకటయ్య

రామన్నపేట: ట్రాఫిక్‌ హోంగార్డు..సీపీఆర్‌ చేసి ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడాడు. ఈ ఘటన గురువారం వరంగల్‌ నగరంలో చోటుచేసుకుంది. వరంగల్‌ హెడ్‌ ఆఫీసు సమీపంలో కడప జిల్లా బద్వేల్‌కు చెందిన పల్లెపు శివ రామయ్య అనే వ్యక్తికి ఒక్కసారి గుండె పోటు రావడంతో రోడ్డుపై పడిపోయాడు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్‌ హోంగార్డు వెంకటయ్య వెంటనే అతని వద్దకు చేరుకొని సీపీఆర్‌ చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. వెంటనే అతడిని మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడిన హోంగార్డు వెంకటయ్యను అధికారులు అభినందించారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

మహబూబాబాద్‌ రూరల్‌: మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలోని ఇందిరాకాలనీకి చెందిన పత్తి శ్రీకాంత్‌పై దాడి చేసి గాయపర్చిన ఘటనలో అతడి భార్య చందన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్‌ ఎస్సై వి.దీపికారెడి గురువారం తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పత్తి శ్రీకాంత్‌పై వారి బంధువులు పత్తి మాధవి, శ్రీధర్‌, శ్రీహరి, శ్రీరాం, ప్రమీల, శివాని దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. కాగా, బంధువుల నుంచి తమకు ప్రాణభయం ఉందని చందన టౌన్‌ పోలీస్‌ స్టేషనలో ఫిర్యాదు చేసింది.

రాష్ట్రంలో ప్రగతి పరుగులు



కడవెండిలో సభలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో కలెక్టర్‌ శివలింగయ్య, తదితరులు

'పల్లెప్రగతి'తో మారిన గ్రామాల స్వరూపం

- ఉద్యమవీరుల స్ఫూర్తితో కడవెండి రుణం తీర్చుకుంటా
- పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- రూ.4.41కోట్ల పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీ

దేవరుప్పుల : బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రగతి పరుగులు తీస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం కడవెండిలో నిర్వహించిన 'పల్లె ప్రగతి దినోత్సవ' కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్‌ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన 1851 జీపీలు 'పల్లెప్రగతి' పనులతో సమగ్రాభివృద్ధి చెందాయని, తెలంగాణ ఓడీఎఫ్‌ రాష్ట్రంగా ఘనత సాధించిందని చెప్పారు. తాగు, సాగు నీటి కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో మహిళలకు వెసులుబాటు, భూమికి ధర పెరిగి అన్నదాతల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. పొన్నాల లక్ష్మయ్య మంత్రిగా ఉన్న సమయంఒ ఈ ప్రాంత అభివృద్ధిని విస్మరిస్తే తాను సమగ్రాభివృద్ధికి కృషి చేసినట్లు ఎర్రబెల్లి పేర్కొన్నారు. ఉద్యమాల గడ్డ కడవెండి రుణం తీర్చుకోవడానికి 'పల్లెప్రగతి' దినోత్సవం కార్యక్రమాన్ని ఇక్కడి నుంచి ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. చైతన్యవంతమైన ప్రజలు విపత్కర పరిస్థితుల్లోనూ మూడు దఫాలుగా ఆశీర్వదించడంతో నేడు మంత్రిగా రాణించగలుగుతున్నానని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఐఎస్‌ఓ సర్టిఫికెట్లకు ఎంపికైన జీపీల సర్పంచ్‌లు పోతిరెడ్డి బెత్లీనా(కడవెండి), యాకంతారరావు(పాలకుర్తి) తోపాటు కొడవటూరు, చిన్నపెండ్యాల జీపీలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అలాగే జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కింద రూ.4కోట్ల 40 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు కిట్లు అందజేశారు. డీపీఓ రంగాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్‌ సీహెచ్‌.శివలింగయ్య, అదనపు కలెక్టర్‌ ప్రఫుల్‌దేశాయ్‌, డీఆర్‌డీఓ రామిరెడ్డి, డీఈఓ రాము, ఎంపీపీ బస్వ సావిత్రి, వైస్‌ఎంపీపీ విజయ్‌, ఎంపీటీసీ కవిత, తహసీల్దార్‌ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్‌కుమార్‌, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ రమేష్‌, ఉపసర్పంచ్‌ నగేష్‌, విద్యాసాగర్‌, వీరాచారి, సోమయ్య, దయాకర్‌, బస్వ మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ర్యాలీ అనంతరం నూతన జీపీ భవనం, పాలసేకరణ కేంద్రాన్ని, పాఠశాలలో డైనింగ్‌ హాల్‌, డిజిటల్‌ క్లాస్‌ గదిని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు.

'పెరుమాండ్ల'కు పెంపు లేనట్లే..!

ఈ నెల 21తో ముగియనున్న సీజీఆర్‌ఎఫ్‌ చైర్మన్‌ సత్యనారాయణ పదవి కాలం

- ఖాళీ చైర్మన్‌ స్థానానికి ఇంటర్వ్యూ
- ఇద్దరు రిటైర్డ్‌ ఇంజనీర్లు హాజరు
- ఆ ఇద్దరిలో ఎవరిని వరించేనో..



సీజీఆర్‌ఎఫ్‌ కార్యాలయం

హన్మకొండ: విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్‌-1) వరంగల్‌ చైర్మన్‌ పెరుమాండ్ల సత్యనారాయణ పదవీకాలం పెంపు లేనట్లేనని తేలిపోయింది. ఈ నెల 21తో మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకోనున్న ఆయన.. మరికొంత కాలం చైర్మన్‌గా కొనసాగేందుకు ప్రయత్నాలు చేశారు. తనకున్న పరిచయాల ద్వారా పదవి కాలపరిమితి పొడిగింపునకు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. కాగా, విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి టీఎస్‌ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ పరిధిలో రెండు సీజీఆర్‌ఎఫ్‌లను ఏర్పాటు చేసింది. సీజీఆర్‌ఎఫ్‌-1 వరంగల్‌ కేంద్రంగా, సీజీఆర్‌ఎఫ్‌-2 నిర్మల్‌ కేంద్రంగా ఏర్పాటు చేశారు. వరంగల్‌ కేంద్రంగా ఏర్పాటు చేసిన సీజీఆర్‌ఎఫ్‌-1 ఉమ్మడి కరీంనగర్‌, వరంగల్‌, ఖమ్మం జిల్లాల పరిధిలో పని చేస్తుంది. నిర్మల్‌ కేంద్రంగా ఏర్పాటు చేసిన సీజీఆర్‌ఎఫ్‌-1 ఉమ్మడి నిజామాబాద్‌, ఆదిలాబాద్‌ జిల్లా పరిధిలో పని చేస్తుంది. టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ ద్వారా సేవలు అందడంలో ఆలస్యమైనా, సౌకర్యాలు కల్పించకపోయిన, విద్యుత్‌ సర్వీస్‌ల మంజూరు, ఆలస్యం వంటి సమస్యలను వినియోగదారులు సీజీఆర్‌ఎఫ్‌లో ఫిర్యాదు చేసి పరిష్కరించుకునేందుకు ఈ వేదికను ఏర్పాటు చేశారు.

మే 29న చైర్మన్‌ పదవికి ఇంటర్వ్యూ..

ప్రస్తుత వరంగల్‌ సీజీఆర్‌ఎఫ్‌ చైర్మన్‌ పెరుమాండ్ల సత్యనారాయణ 2020 జూన్‌ 22న బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల కాల పరిమితితో టీఎస్‌ ఈఆర్‌సీ అప్పట్లో సత్యనారాయణను చైర్మన్‌గా నియమించింది. పదవీకాలం సమీపించడంతో మే 29న చైర్మన్‌ పదవికి ఇంటర్వ్యూ నిర్వహించడంతో సత్యనారాయణకు పొడిగింపు దారులు మూసుకుపోయాయి. దీంతో త్వరలో కొత్త చైర్మన్‌ రానున్నారు. ఈ నెల 29న ఇంధన శాఖ, టీఎస్‌ ఈఆర్‌సీ నిర్వహించిన ఇంటర్వ్యూకు ఇద్దరు రిటైర్డ్‌ చీఫ్‌ ఇంజనీర్లు హాజరయ్యారు. వీరిలో ఒక్కరికి సీజీఆర్‌ఎఫ్‌ చైర్మన్‌గా అవకాశం దక్కనుంది. టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయంలో కన్‌స్ట్రక్షన్‌ ఇంజనీర్‌గా పని చేసి రిటైర్డ్‌ అయిన ఇ.నారాయణ, కమర్షియల్‌ చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌గా పని చేసి రిటైర్డ్‌ వేణుగోపాల చారి ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వీరిద్దరిలో ఒక్కరిని సీజీఆర్‌ఎఫ్‌ చైర్మన్‌గా నియమించే అవకాశముంది. ఈ నెల 21తో ప్రస్తుత చైర్మన్‌ సత్యనారాయణ పదవీ కాలం ముగియనుండడంతో ఈ లోపు నూతన చైర్మన్‌ నియామకానికి సంబంధించి ఉత్తర్వులు వెలువడే అవకాశముందని విద్యుత్‌ ఉద్యోగ వర్గాలు తెలిపాయి. కాగా, ఇంటర్వ్యూలు నిర్వహించిన వారిలో ఒక్కరిని చైర్మన్‌గా నియమిస్తుందా లేదా ప్రస్తుత చైర్మన్‌ పదవీకాలం పొడిగిస్తుందా అనే విషయంపై ఉత్తర్వులు వెలువడితేనే స్పష్టత వస్తుంది.

ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలకు 19 చివరి తేదీ

ఐటీఐలో ట్రేడ్‌ల వివరాలు... (ఫీజు రూ.లలో)

ట్రేడ్‌	అర్హత	కాలవ్యవధి	సీట్లు	ఏడాదికి ఫీజు
డీజిల్‌ మెకానిక్‌	10వ తరగతి	1 సంవత్సరం	48	16,500
మోటారు మెకానిక్‌	10వ తరగతి	2 సంవత్సరాలు	24	16,500
వెల్డర్‌	10వ తరగతి	1 సంవత్సరం	20	16,500
పెయింటర్‌	10వ తరగతి	2 సంవత్సరాలు	40	16,5000

హన్మకొండ: వరంగల్‌ ములుగు రోడ్డులోని ప్రభుత్వరంగ సంస్థ టీఎస్‌ ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 19 తుది గడువుగా నిర్ణయించారు. అనుభవజ్ఞులైన, సుశిక్షితులైన ఇన్‌స్ట్రక్టర్లతో అత్యుత్తమ విద్యా బోధన సాగుతోందని ప్రిన్సిపాల్‌ వంగాల మోహన్‌ రావు గురువారం తెలిపారు. సంస్థ డిపో గ్యారేజీలో అత్యాధునిక టెక్నాలజీ ఇంజిన్‌ (బీఎస్‌-6) వంటి బస్సులపై ఉత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రాజెక్టర్‌ ద్వారా పాఠ్యాంశాల బోధన, కంప్యూటర్‌ శిక్షణ అందిస్తున్నారు. ఇదే సంస్థలో అప్రెంటీస్‌ సౌకర్యం కల్పిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9849425319, 8008136611 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దత్తత గ్రామాల్లో పనులు పూర్తి చేయాలి

- టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, ఎండీ గోపాల్‌ రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, ఎండీ గోపాల్‌ రావు

హన్మకొండ: విద్యుత్‌ అధికారుల దత్తత గ్రామాల్లో పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ అన్నమనేని గోపాల్‌ రావు ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్‌ ఎన్పీ డీసీఎల్‌ ప్రధాన కార్యాలయం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్‌ఈలు, డీఈలు, సీనియర్‌ అకౌంట్స్‌ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రతిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీఎస్‌ ఐపాస్‌, హెచ్‌టీ సర్వీస్‌ల మంజూరులో జాప్యం లేకుండా రిలీజ్‌ చేయాలన్నారు. కాలిన, పనిచేయని మీటర్లను మార్చాలన్నారు. రెండు సంవత్సరాలు పైబడిన వర్క్‌ ఆర్డర్లను పూర్తి చేయాలన్నారు. రూ.50,000 పైబడిన బకాయిని వసూలు చేయాలన్నారు. 33/11 కేవీ అంతరాయాలు తగ్గించి ఫీడర్లపై ఓవర్‌ లోడ్‌ భారం పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్‌ ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు లైన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్‌ బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, డీఈ (ఐటీ) అనిల్‌ కుమార్‌, సీజీఎంలు, ఎస్‌ఈలు, డీఈలు పాల్గొన్నారు.